సాక్షి అనకాపల్లి

శనివారం । 19 । ఏప్రిల్ । 2025

బలం లేక బలవంతంగా..!



గ్రేటర్‌లో బలం లేకపోయినా కూటమి కుట్ర రాజకీయాలకు తెరతీసింది. అవిశ్వాసంలో నెగ్గేందుకు అడ్డదారులు తొక్కుతోంది. మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోడానికి చివరి క్షణంలోనూ కుతంత్రాలు పన్నుతోంది. అవిశ్వాస తీర్మానం వీగిపోతుందన్న భయంతో చివరి అంకానికి సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను తీర్మాన సమావేశానికి బలవంతంగా తీసుకువచ్చేందుకు రౌడీలను రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది.

– విశాఖ సిటీ

10లో

కదిలింది కరుణ రథం..



యలమంచిలిలో గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని క్రీస్తు శిలువను మోస్తున్న ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జిల్లావ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. లోక రక్షకుడైన క్రీస్తు.. సర్వ మానవపాప విముక్తి కోసం మరణ శిక్ష పొందిన రోజును శుభ శుక్రవారంగా పేర్కొంటూ క్రైస్తవ విశ్వాసులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు శిలువ మోసిన రోజును స్మరించారు. ఈ శుభ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో అన్ని క్రైస్తవ మందిరాలు కిక్కిరిశాయి.



అడ్డురోడ్డులో ఏసు శిలువ వేస్తున్న సన్నివేశం

న్యూస్‌రీల్

క్రీడల్లో సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆదేశాల మేరకు ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు–2025కు మాస్ స్పోర్ట్స్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం కింద స్పోర్ట్స్ కోచింగ్‌లో ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను 2025 మే 6 నుంచి జూలై 2 వరకూ తీసుకోవడం జరుగుతుందని జిల్లా క్రీడాఅభివృద్ధి అధికారి ఎల్.వి.రమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుపై ఆసక్తిగల అభ్యర్థులు https://www.6wcc.nsnis.in ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9963177814 నంబరును సంప్రదించాలన్నారు.

ఈకో రైల్వే జీఎం పర్యటన

తాటిచెట్లపాలెం (విశాఖ) : ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాట్‌ఫారమ్‌లపై ప్రయాణికుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను, స్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. జీఎం పర్యటనలో భాగంగా రైల్వేస్టేషన్‌లో ఉన్న పాదచారుల వంతెనలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ క్యాబిన్‌లను ఆయన తనిఖీ చేశారు. విశాఖ–భువనేశ్వర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులతో ముచ్చటించి, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాల్తేర్ డివిజన్ ఏడీఆర్‌ఎంలు మనోజ్‌కుమార్ సాహూ (ఆపరేషన్స్), ఈ. శాంతారా (ఇన్‌ఫ్రా)తో పాటు ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు

అనకాపల్లి టౌన్: జిల్లాలోని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో ఒకటో తరగతిలో విద్యా హక్కు చట్టం ప్రకారం ఉచిత ప్రవేశాలకు ఈ నెల 19 నుండి 26 వరకు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి ఈ నెల 28 నుండి మే 15 వరకు ప్రవేశాలు జరుగుతాయని, పూర్తి వివరాలకు 95507 87454 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

క్వారీ పేలుడు పదార్థాల నిల్వల పరిశీలన



పేలుడు పదార్థాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి టౌన్: మామిడిపాలెంలో క్వారీలకు ఉపయోగించే పేలుడు పదార్థాల నిల్వ కేంద్రాన్ని డీఎస్పీ శ్రావణి శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో అనుమతికి మించి జెలిటిన్ స్టిక్స్ ఏమైనా ఉన్నాయా? అని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ కలిగి ఉన్న వారికి మాత్రమే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ జి.అశోక్ కుమార్, ఎస్ఐ రవికుమార్ పాల్గొన్నారు.

వాతావరణం

అనకాపల్లి : రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు ఐదు రోజులు 35.4 నుంచి 37.0 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.6 నుంచి 27.6 డిగ్రీలు, గాలిలో తేమ శాతం ఉదయం 80 నుంచి 85 వరకూ, మధ్యాహ్నం 72 నుంచి 78 వరకూ ఉండి, గాలి గంటకు 4 నుంచి 5 కిలోమీటర్లు వీస్తుందన్నారు.

జీడి రైతు కష్టం.. దళారుల భోజ్యం

ఒక వైపు వాతావరణం అనుకూలంగా లేక గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది జీడి పంట దిగుబడులు సగానికి పైగా తగ్గిపోయాయి. అయితే అరకొరగా పండిన ఆ కాస్త జీడి పిక్కలను అమ్ముకునే దారి లేక రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ సహకారం లేక మార్కెట్ సదుపాయం లేక దళారులు అడిగిన రేటుకు పంట తెగనమ్ముకుని జిల్లాలో జీడి రైతులు కుదేలవుతున్నారు.

- ప్రతి మండలంలో జీడి ఫ్యాక్టరీలు
- ధర పెరగకుండా దళారులు, యాజమాన్యాల కుమ్మక్కు
- నష్టపోతున్న జీడి రైతులు.. పట్టించుకోని ప్రభుత్వం
- మార్కెటింగ్ సదుపాయం కల్పించడంలో విఫలం

నాతవరం :

జీడి రైతులకు ప్రభుత్వం మార్కెట్ సదుపాయం కల్పించకపోవడంతో పంట విక్రయించుకునే దారి లేక జీడి పిక్కలు తమ ఇళ్ల వద్దే నిల్వ చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ప్రైవేటు జీడి ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఫ్యాక్టరీ యాజమాన్యాలు మాత్రం నేరుగా రైతుల నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేయడం లేదు. ప్రైవేటు వ్యాపారులు, ఫ్యాక్టరీ యాజమాన్యం కుమ్మక్కై రైతుల వద్ద జీడి పిక్కలు ఉన్నంత కాలం రేటు పెరగకుండా గిమ్మిక్కులు చేస్తున్నారు. రైతులు తక్కువ రేటుకు జీడిపిక్కలు విక్రయించాక మార్కెట్లో రేటు అమాంతంగా పెరుగుతుంది. ఈ తతంగం ప్రతి ఏటా జరిగేదే. జిల్లాలో వరి పంట తర్వాత అధికంగా రైతులు జీడి తోటలు సాగు చేస్తున్నారు. కానీ మార్కెటింగ్ సదుపాయం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది.



వ్యాపారులు రాక ఎండలో ఆరబోసిన జీడి పిక్కలు

అక్కడలా..ఇక్కడిలా...

ప్రైవేటు వ్యాపారులు ఉగాది రోజున జీడి పిక్కలు కొనుగోలు ప్రారంభించారు. ఆరోజు పిక్కలు 80 కేజీల బస్తా రూ.11వేలు చొప్పున కొనుగోలు చేశారు. వాస్తవంగా బయట మార్కెట్లో బస్తా రూ.13 వేల నుంచి రూ.14 వేల మధ్య నాణ్యతను బట్టి ధర పలుకుతుంది. శ్రీకాకుళం జిల్లాలో పలాస, టెక్కలి ప్రాంతంలో అక్కడ జీడి పరిశ్రమ యాజమానులు 80 కేజీల బస్తా నాణ్యతను బట్టి మొదట రకం రూ.14వేలకు పైగా ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ప్రైవేటు వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి ధర పెరగకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 58 వేల ఎకరాల్లో...

జిల్లాలో 24 మండలాల్లో జీడి మామిడి తోటలు 58 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. నాతవరం, రోలుగుంట, నక్కపల్లి, కోటవురట్ల, గొలుగొండ, రావికమతం, బుచ్చెయ్యపేట, మాడుగుల, ఎస్.రాయవరం మండలాల్లో అధికంగా, మిగతా మండలాల్లో ఓ మోస్తరుగా జీడి పంట సాగు చేస్తున్నారు. వాటిలో నాతవరం మండలంలో జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో జీడి తోటలు సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా మార్చి నుంచి మే నెలాఖరు వరకూ మూడు నెలల పాటు పంట కాలం ఉంటుంది. ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే రైతుకు తక్కువ పెట్టుబడితో అధిక అదాయం వస్తుంది. ఎకరం విస్తీర్ణంలో పెద్ద చెట్ల జీడి తోటలో అయితే నాలుగు నుంచి ఐదు బస్తాలు దిగుబడి వస్తుంది. తోట సంరక్షణ, దుక్కి, ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీ ఖర్చు కింద ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. మండలాల్లో కళ్లెదుటే జీడి పిక్కల ఫ్యాక్టరీలు ఉన్నప్పటికీ వారు నేరుగా కొనుగోలు చేయకపోవడంతో రైతులకు పంట అమ్ముకోవడానికి దళారులు తప్ప మరో దిక్కులేకుండా పోయింది.



జీడి పండ్ల నుంచి పిక్కలు వేరు చేస్తున్న రైతులు

గతంలో వెలుగు ద్వారా కొనుగోలు..

గతంలో ప్రభుత్వం కేరళకు చెందిన ఓలం జీడి పిక్కల కంపెనీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకుని డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వెలుగు అధికారుల ద్వారా మండలాల్లో రైతుల నుంచి జీడిపిక్కలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం రంప చోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు నేరుగా రైతుల నుంచి జీడి పిక్కలు కొనుగోలు చేస్తున్నారు. పాడేరు ఐటీడీఏ జీసీసీ ద్వారా కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అయితే అనకాపల్లి జిల్లాలో మాత్రం జీడి రైతులకు అధికారుల సహకారం కొరవడింది.

కలెక్టరు దృష్టి సారించాలి

మేము పండించిన జీడి పిక్కలను ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నాం. గతంలో వెలుగు అధికారుల ద్వారా ప్రభుత్వం జీడి పిక్కలు కొనుగోలు చేసేది. ఇపుడు అదేవిధంగా కలెక్టరు చొరవ చూపి జిల్లాలోని జీడి పిక్కల ఫ్యాక్టరీ యాజమాన్యాలతో మాట్లాడి రైతుల నుంచి నేరుగా జీడిపిక్కలు కొనుగోలు చేస్తే ఎంతో మేలు జరుగుతుంది.

– శిరుసుపల్లి శేఖర్, ఎం.బెన్నవరం, జీడి రైతు

ప్రభుత్వం ఆదుకోవాలి



జీడి పిక్కలు పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించి అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలి. దళారీ వ్యవస్థని నిర్మూలించి నేరుగా ఫ్యాక్టరీల నుంచే పిక్కల కొనుగోలు చేస్తే మోసాలు లేకుండా రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

– బాలేపల్లి వెంకటరమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఆందోళన చేశాం...



ఈ ఏడాది జీడి పంట దారుణంగా దెబ్బతినడంతో రైతులతో కలిసి మార్చిలో పార్టీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో ఆందోళన చేశాం. రైతులు పడే బాధలు, నష్టపోయిన విధానాన్ని స్వయంగా పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కానీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. కష్టపడే రైతులను ఏ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా తీవ్ర పరిణామాలు చవిచూస్తారు.

–అడిగర్ల రాజు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు



రైతుల నుంచి జీడి పిక్కలు కొనుగోలు చేసేందుకు మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతంలో నేరుగా మేము పిక్కలు రైతుల నుంచి విక్రయాలు చేసిన మాట వాస్తవమే. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వస్తే జీడి పిక్కలు విక్రయాలు చేస్తాం.

– కనకరాజు, వెలుగు ఏపీఎం

షెడ్డు వేసెయ్.. పరిహారం కొట్టేయ్...!



నిర్వాసితుల పునరావాసం కోసం కొనుగోలు చేస్తున్న భూములు



ఏపీఐఐసీ పునరావాసం కోసం కొనుగోలు చేసిన భూముల్లో వెలసిన రేకుల షెడ్డు

- పునరావాస భూముల్లో కూటమి నేత అక్రమాలు
- తాత్కాలిక షెడ్డు వేసి పరిహారం కోసం ఒత్తిడి
- రూ.11 లక్షలు చెల్లించిన అధికారులు
- మరో షెడ్డు వేసి పరిహారానికి మళ్లీ పైరవీలు..

వడ్డించేవాడు మనవాడైతే....అన్నట్టుగా ఉంది కూటమి నేతల తీరు. ఏపీఐఐసీ వారికి పరిశ్రమల కోసం భూములు, నివాస ప్రాంతాలు ఇచ్చిన నిర్వాసితులకు పునరావాసం కోసం ఎంపిక చేసిన భూముల్లో కొంతమంది కూటమి నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారు. రాత్రికి రాత్రే తాత్కాలిక రేకుల షెడ్లు ఏర్పాటు చేసి పరిహారం చెల్లించాలంటూ అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. ఇలా ఒత్తిళ్లకు తలొగ్గి ఒక కూటమి నేతకు సుమారు రూ.11 లక్షలు నష్ట పరిహారం చెల్లించడంతో మరో షెడ్డు వేసి దానికి కూడా నష్టపరిహారం చెల్లించాలంటూ ఒత్తిడి తీసుకు రావడం చర్చనీయాంశమైంది. ఇలా పరిహారం చెల్లింపులో ముడుపులు చేతులు మారుతున్నాయన్న విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

నక్కపల్లి : మండలంలో రాజయ్యపేట, బోయపాడు, చందనాడ, అమలాపురం, పాటిమీద, మూలపర, వేంపాడు, డీఎల్‌పురం గ్రామాల్లో ఏపీఐఐసీ వారు పరిశ్రమల స్థాపన కోసం 4500 ఎకరాల భూములను సేకరించిన విషయం తెలిసిందే. ఈ భూములను బల్క్ డ్రగ్‌పార్క్‌కు, ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం కేటాయించారు. బోయపాడు, రాజయ్యపేట, మూలపర తదితర గ్రామాల్లో సుమారు 800 మందికి పైగా నివాస ప్రాంతాలను, ఇళ్లను కోల్పోవాల్సి వస్తుంది. ఇళ్లు తొలగించాల్సి రావడంతో ప్రభుత్వం వీరికి పెదబోదిగల్లం సమీపంలో పునరావాసం కల్పించాలని నిర్ణయించింది. నిర్వాసితుల్లో ఒక్కొక్కరికి ఐదు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాల్సి ఉంది. ఈ పునరావాసం కోసం పెదబోదిగల్లం పరిధిలో 170 ఎకరాల జిరాయితీ భూములను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తోంది. ఎకరాకు రూ.30 లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే సుమారు 65 ఎకరాలకు పైగా భూములను రైతుల నుంచి కొనుగోలు చేసి ఏపీఐఐసీ వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ భూములు సేకరించేందుకు 4(1) నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం, నేరుగా రైతుల నుంచి ధర మాట్లాడుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించడం కొంతమంది కూటమి నాయకుల అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది.

ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల్లో ఒక కూటమి నేతకు చెందిన సుమారు ఐదెకరాల భూమి ఉంది. పునరావాసం కోసం నేరుగా రైతుల నుంచే భూములు కొనుగోలు చేస్తున్న విషయం తెలుసుకుని సదరు నేత గత ఏడాది డిసెంబర్‌లో ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న భూముల్లో తాత్కాలికంగా షెడ్లు వేశాడు. భూములతో పాటు వాటిలో ఉన్న షెడ్లకు కూడా నష్టపరిహారం చెల్లించాలని పైస్థాయిలో పైరవీలు చేయడంతో అధికారులు గత్యంతరం లేక సదరు నాయకుడి భూములకు నష్టపరిహారంతో పాటు భూముల్లో ఉన్న ఉన్న షెడ్లకు అదనంగా రూ.11 లక్షలు నష్టపరిహారం చెల్లించారు. దీన్ని అవకాశంగా తీసుకున్న సదరు నాయకుడు తాజాగా మరో రెండు షెడ్లు వేసి వీటికి కూడా నష్టపరిహారం చెల్లించాలని అధికార పార్టీలో ఉన్న ముఖ్యనాయకుల ద్వారా ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడు. ఈ విషయం బయటకు పొక్కడంతో వ్యవహారం అధికారుల వద్దకు వెళ్లింది. పరిహారం చెల్లిస్తే ఎక్కడ తమ ఉద్యోగాలకు ముప్పు కలుగుతుందోనన్న భయంతో అధికారులు పరిహారం చెల్లించేందుకు వెనుకాడుతున్నారు. అయినా సదరు చోటా నాయకుడు పట్టు వదలని విక్రమార్కుడిలా పరిహారం కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాడన్న ప్రచారం జరుగుతోంది. ఒకసారి షెడ్లకు చెల్లించిన పరిహారంలోనే సుమారు రూ.3 లక్షలు పైగా చేతులు మారాయని, కొంతమంది అధికారులు, సిఫారసు చేసిన నాయకులకు మామూళ్లు ఇవ్వడం వల్లే నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పునరావసం కోసం భూములు ఎంపిక చేసిన సమయంలోనే భూముల్లో ఏ పంట ఉంది, నిర్మాణాలు ఏమైనా ఉన్నాయా? అనే వివరాలను అధికారులు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ మేరకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది.

కానీ కూటమి నాయకుడికి పరిహారం చెల్లింపుల విషయంలో ఈ నిబంధనలు పాటించారా లేదా అన్నది అధికారులకెరుక. ఏది ఏమైనా ఒకషెడ్డుకు పరిహారం చెల్లించారు కాబట్టి రెండో దానికి కూడా చెల్లించాల్సిందేనంటూ సదరు నాయకుడు పట్టుబడుతున్నాడు. అధికారుల నిర్ణయం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల : రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు జిల్లాలో ప్రతిభ కనబర్చిన 5 నుంచి 18 ఏళ్ల (31 జూలై, 2025 లోపు) వయస్సు గల బాలల నుంచి కేంద్ర ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జాతీయ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను ప్రదానం చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తోందని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటలో తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్యసాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు గల వాటిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్న భారత సంతతికి చెందిన ఆసక్తి గల గల బాలలు జులై 31 తేదీ లోపుగా ఈ వెబ్‌సైట్ http:/awards.gov.in ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని సూచించారు. కేంద్రం నియమించిన కమిటీ ద్వారా పరిశీలించి, ఎంపిక కాబడ్డ బాలలకు న్యూఢిల్లీలో 2026, జనవరిలో రాష్ట్రపతి చేతుల మీదుగా బహుమతితో పాటు, ప్రశంసాపత్రాన్ని, జ్ఞాపికను అందజేయనున్నారన్నారు. రాష్ట్రంలో ప్రతిభ గల ఆయా రంగాల బాలలను వెన్ను తట్టి ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్రంలోని వివిధ శాఖల ద్వారా వీటిపై విరివిగా అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, సదస్సులు, నిర్వహించి ఆంధ్ర రాష్ట్ర బాలల ప్రతిభాపాటవాలు దేశ వ్యాప్తంగా ఇనుమడింపజేసేలా చర్యలు చేపట్టాలని కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు.



ఈపీడీసీఎల్‌కు టెండర్

10లో

- సబ్ స్టేషన్లు పంచుకుంటున్నారు
- సబ్ స్టేషన్ల నిర్మాణంలో హస్తలాఘవం
- మూడు సంస్థలకే అన్ని ప్యాకేజీల అప్పగింత

ఈపీడీసీఎల్‌కు టెండర్

సాక్షి, విశాఖపట్నం : ఆస్తులు పంచుకున్నట్లు.. ఈపీడీసీఎల్‌లో పనులు పంచేసుకుంటున్నారు. అధికారుల అండదండలతో ఈ భాగంలో పనులు నీకు.. ఆ భాగంలో నీకు.. అంటూ వాటాలు వేసుకుంటూ మరీ.. టెండర్ల ప్యాకేజీలు అప్పనంగా అప్పగించేస్తున్నారు. సర్కిల్ ఏదైనా ఎలాంటి సబ్‌స్టేషన్ అయినా ఆ మూడు సంస్థలకే పనులు కట్టబెట్టేలా విద్యుత్ శాఖ అధికారులు హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒకసారి టెండర్ ధర కంటే లెస్‌కు వేస్తే మరోసారి అధికంగా వేస్తారు. అయినా వారికే కాంట్రాక్టులు కట్టబెడతారు. ఇటీవల దాదాపు 35 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులన్నీ మూడు కాంట్రాక్టు సంస్థల జేబుల్లోకే వెళ్లిపోయాయి.

గత ఏడాది కాలంలో ఈపీడీసీఎల్ పరిధిలో 35 సెమీ ఇండోర్ సబ్ స్టేషన్లు, అవుట్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సర్కిళ్ల వారీగా టెండర్లు పిలిచారు. ఇక్కడే విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరం సర్కిల్, విశాఖపట్నం (పాత సర్కిల్) పరిధిలో 3 సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్లు, 6 అవుట్‌డోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు కనెక్టింగ్ లైన్స్, ఇంటర్ లింకింగ్ లైన్స్ ఏర్పాటుకు సంబంధించి ఒక ప్యాకేజీగా టెండర్లు పిలిచారు. అదేవిధంగా పాత తూర్పుగోదావరి సర్కిల్ పరిధిలో 8 అవుట్ డోర్ సబ్‌స్టేషన్లు, 8 ఇండోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, ఇతర పనులకు, పాత పశ్చిమ గోదావరి సర్కిల్ పరిధిలో 5 అవుట్‌డోర్, 5 ఇండోర్ సబ్‌స్టేషన్లు, ఇతర పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. మొత్తం 35 సబ్‌స్టేషన్ల నిర్మాణ పనుల్ని మూడు ప్యాకేజీలుగా సర్కిళ్ల వారీగా విభజించారు.

మీరు లెస్‌కు.. మేం ఎక్సెస్‌కు..

సదరు కాంట్రాక్టు సంస్థలు కూడా ఈ పనుల విషయంలో రింగ్‌గా వ్యవహరించినట్లు ఈపీడీసీఎల్‌లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక ప్రాంతంలో టెండరు విలువ కంటే తక్కువకు కోట్ చేస్తే.. మరో ప్రాంతంలో అధిక ధరకు టెండరు దాఖలు చేశారు. వారు ఎలా టెండర్ ఫైల్ చేసినా.. ఇవ్వాలన్నదే విద్యుత్ అధికారుల అంతిమ లక్ష్యంగా వ్యవహరించారని సమాచారం. విజయనగరం, విశాఖపట్నం సర్కిళ్ల పరిధిలో రూ.21.77 కోట్లకు టెండర్లు పిలవగా సదరు సంస్థ 1.31 శాతం అధికంగా రూ.22.06 కోట్లకు టెండర్ వేసింది. అయినా సదరు కాంట్రాక్టు సంస్థకే టెండరు దక్కింది. అదేవిధంగా పాత పశ్చిమ గోదావరి సర్కిల్ పరిధిలో రూ.16.42 కోట్లకు టెండర్లు పిలిస్తే 1.35 లెస్‌తో రూ.16.2 కోట్లతో టెండర్లు దాఖలు చేసిన సంస్థకు అప్పగించారు.

13.6 శాతం లెస్‌కు వేస్తే నాణ్యత ఎలా.?

ఇక పాత ఈస్ట్‌గోదావరి సర్కిల్ పరిధిలో విచిత్రంగా తక్కువ ధరకే పనులు చేసేస్తామంటూ సదరు సంస్థ టెండరు దాఖలు చేసింది. ఈ సర్కిల్ పరిధిలో రూ.18.58 కోట్లకు టెండర్లు పిలిచారు. అయితే అధికారుల అనుయాయ కాంట్రాక్టు సంస్థ ఏకంగా 13.6 శాతం లెస్‌కు అంటే రూ.16.06 కోట్లకు టెండర్ ఫైల్ చేసింది. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, కనెక్టింగ్ లైన్స్, ఇంటర్‌లింకింగ్ లైన్స్‌ని పూర్తి నాణ్యతతో నిర్మించాలి. కానీ సదరు సంస్థ 13.6 శాతం లెస్‌కు వేసినప్పుడు తక్కువ సొమ్ముతో నాణ్యమైన సబ్‌స్టేషన్లు నిర్మాణం ఎలా సాగుతుందన్న ఆలోచన విద్యుత్ శాఖ అధికారులకు వచ్చినా వాటన్నింటినీ పక్కనపెట్టేసి పనులు కట్టబెట్టయ్యడం గమనార్హం. కాంట్రాక్టు సంస్థలకు విద్యుత్ శాఖ అధికారులు దాసోహం అన్నట్లుగానే విద్యుత్ శాఖ అధికారులు ఈపీడీసీఎల్ పరిధిలో ఏ భారీ టెండర్ అయినా.. సదరు మూడు సంస్థలకే ప్రథమ ప్రాధాన్యమిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్కిల్‌కి ఒక కాంట్రాక్టర్ చొప్పున..

సర్కిళ్ల వారీగా పిలిచిన ఈ పనులను ఈపీడీసీఎల్‌ను శాసిస్తున్న మూడు కాంట్రాక్టు సంస్థలకు వచ్చేలా టెండర్ల నిబంధనల్లో మార్పులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కాంట్రాక్టు సంస్థలు తమ క్వాలిఫికేషన్లకు అనుగుణంగానే టెండర్ల నిబంధనలు దగ్గరుండి మరీ తయారు చేసినట్లు తెలుస్తోంది. వారి అడుగులకు మడుగులొత్తే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఈ వ్యవహారాన్ని నడిపించారు. తాము ముందుగా అనుకున్నట్లుగానే టెండర్లను మూడు భాగాలుగా విభజించి ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో కాంట్రాక్టర్‌కు పంచేశారు.



బలం లేక బలవంతంగా..!

ఓటమి భయంతో చివరి అంకానికి కూటమి తెర

- అవిశ్వాసంలో నెగ్గేందుకు అడ్డదారులు
- వ్యాపారాలు చేసే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు బెదిరింపులు
- పార్టీ మారకపోతే బిజినెస్‌లు టార్గెట్ చేస్తామని హెచ్చరికలు
- నేటి ఉదయం 11 గంటలకు అవిశ్వాస ఓటింగ్‌కు ఏర్పాట్లు

మున్నార్‌లో ఉన్న కార్పొరేటర్లను ప్రత్యేక విమానంలో విశాఖకు తీసుకువచ్చేందుకు ఒక గ్యాంగ్ కొచ్చికి చేరుకుందన్న టాక్ వినిపిస్తోంది. అలాగే వ్యాపారాలు చేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను మరోవైపు టార్గెట్ చేసింది. పార్టీ మారని పక్షంలో బిజినెస్‌లను దెబ్బకొడతామని బెదిరింపులకు దిగుతోంది. ఎలాగైనా శనివారం జరిగే అవిశ్వాస తీర్మానంలో నెగ్గేందుకు అవసరమైన అన్ని శక్తియుక్తులను వినియోగిస్తోంది. ఒకవైపు ఈ అవిశ్వాస తీర్మానాన్ని బహిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఇప్పటికే తేల్చి చెప్పింది. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లకు విప్ జారీ చేసింది. అయినప్పటికీ.. ఆ పార్టీ కార్పొరేటర్లను బలవంతంగా అయినా ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి రప్పించాలని కుటిల ప్రయత్నాలు చేస్తోంది.

కూటమికి ఓటమి భయం..

2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 58 స్థానాల్లో గెలుపొంది మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. టీడీపీ 30, జనసేన 3, సీపీఐ, సీపీఎంలు ఒక్కో స్థానాన్ని గెలుచుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు నలుగురు విజయం సాధించారు. అయితే 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మేయర్ స్థానంపై టీడీపీ కన్నేసింది. జీవీఎంసీలో కేవలం 30 మంది మాత్రమే ఉన్నప్పటికీ.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు తాయిలాలు ఎర వేసి లాక్కోవాలని చూసింది. ఇందుకోసం ఒక్కో సభ్యుడికి రూ.10 లక్షలకు పైగా ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ.. చాలా మంది కార్పొరేటర్లు కూటమి వైపు మొగ్గుచూపలేదు. కూటమి కుట్రలు పసిగట్టిన వైఎస్సార్‌సీపీ నేతలు కార్పొరేటర్లను ముందుగానే శిబిరాలకు తరలించారు. అవిశ్వాసానికి సమయం సమీపిస్తున్నప్పటికీ.. మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన బలం లేకపోవడంతో ఆఖరి అంకానికి తెరతీసింది. ముందు పోలీసుల్ని అడ్డుపెట్టుకొని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరించాలని చూసింది. ఇందుకోసం పారిశ్రామిక ప్రాంతంలో పోలీసులు కార్పొరేటర్ ఇంటికి వెళ్లి బెదిరించిన ఘటన తీవ్ర దుమారం రేపింది. దీనిపై వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, నేతలు గట్టిగా స్పందించడంతో పోలీసులు వెనక్కు తగ్గాల్సి వచ్చింది. దీంతో కూటమి నేతలు చివరి పన్నాగాన్ని ఎక్కుపెట్టారు. వ్యాపారాలు ఉన్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టార్గెట్ చేశారు. తాయిలాలకు పడక పోవడంతో బిజినెస్‌లను దెబ్బకొడతామని బెదిరింపులకు దిగుతున్నారు.

కొచ్చికి కూటమి గ్యాంగ్?

శనివారం అవిశ్వాస తీర్మాన ఓటింగ్ జరగాలంటే 74 మంది సభ్యులు ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి హాజరుకావాల్సి ఉంది. వాస్తవానికి కూటమికి ఆ సంఖ్యా బలం లేదు. వైఎస్సార్‌సీపీ ఈ తీర్మాన సమావేశాన్ని బహిష్కరిస్తే.. ఓటింగ్ జరిగే పరిస్థితి ఉండదు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బలవంతంగానైనా జీవీఎంసీకి తీసుకొచ్చేందుకు చివరి క్షణంలో కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఒక గ్యాంగ్ కేరళకు వెళ్లినట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మున్నార్‌లో ఉన్నారు. వీరిని చేరుకోవడం కోసం ఒక గ్యాంగ్ ప్రత్యేక విమానంలో కొచ్చికి వెళ్లినట్లు టీడీపీ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు. మున్నార్ నుంచి కొచ్చికి కార్పొరేటర్లను తీసుకువచ్చి అక్కడి నుంచి విమానంలో విశాఖకు తరలించాలని చూస్తున్నట్లు సమాచారం.

హోటల్ గది నుంచి బయటకు రాకుండా..

మేయర్‌పై అవిశ్వాస తీర్మాన ఓటింగ్‌కు కేవలం కొన్ని గంటలే ఉండడంతో కూటమిలో గుబులు రేగుతోంది. కూటమి కార్పొరేటర్లలో కొందరు మనసు మార్చుకునే అవకాశం ఉందన్న కలవరం మొదలైంది. కేవలం 11 నెలల పదవీ కాలం కోసం బీసీ మహిళా మేయర్‌ను దించడం సరికాదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కూటమి కార్పొరేటర్లు చేజారిపోకుండా ఉండేందుకు వారిని అంటిపెట్టుకొనే ఉండాలని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మలేషియాలో ఉన్న కూటమి కార్పొరేటర్లు శుక్రవారం రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకున్నారు. విమానం ఆలస్యమవడంతో కూటమి నేతలు టెన్షన్ పడ్డారు. అలాగే కూటమి కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ నేతలతో టచ్‌లోకి వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. కొందరికి దసపల్లాలో బస ఏర్పాటు చేశారు. కొందరిని భీమిలిలో ఒక రిసార్టుకు పంపించారు. వారిని హోటల్ గది నుంచి బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శనివారం ఉదయం స్వయంగా ప్రత్యేక వాహనాల్లో పోలీస్ బందోబస్తు మధ్య వారిని నేరుగా జీవీఎంసీకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఏ మాత్రం చిన్న అవకాశం ఇచ్చినా కార్పొరేటర్లు చేజారిపోతారన్న భయంతో కూటమి నేతలు కొట్టు మిట్టాడుతున్నారు.

పునరాలోచనలో మహిళా కార్పొరేటర్లు

మునుపెన్నడూ లేని విధంగా అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక యదవ, బీసీ వర్గానికి చెందిన మహిళ గొలగాని హరివెంకటకుమారిని మేయర్‌గా అవకాశం కల్పించారు. అయితే కూటమిలో అదే సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు మహిళా మేయర్‌ను దించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తన వర్గానికి చెందిన వారే తనపై అవిశ్వాసం పెట్టించడం పట్ల మేయర్ హరివెంకటకుమారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ నుంచి కూటమిలోకి వెళ్లిన పలువురు మహిళా కార్పొరేటర్లు పునరాలోచన పడినట్లు తెలుస్తోంది. ఒక బీసీ మహిళను మేయర్ స్థానం నుంచి దించడం సరికాదన్న ఆలోచనలో గాజువాకకు చెందిన మహిళా కార్పొరేటర్ భూపతిరాజు సుజాతతో పాటు మరికొందరు ఉన్నట్లు సమాచారం. అయితే చివరి నిమిషంలో కూడా అవిశ్వాసానికి కేవలం గంటల సమయం ఉన్నప్పటికీ.. అధికార, పోలీస్ అండదండలతో అవిశ్వాసంలో నెగ్గేందుకు కూటమి నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

అవిశ్వాస తీర్మాన ప్రక్రియపై అనుమానాలు

జీవీఎంసీలో శనివారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. అయితే ఈ కౌన్సిల్ సమావేశం నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నేతలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఓటింగ్ ప్రక్రియను వీడియోలో చిత్రీకరిస్తామని కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ హరేందిర ప్రసాద్ చెప్పారు. జీవీఎంసీ వద్ద 500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల్లో తనిఖీలు



అంతకాపల్లిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

సబ్బవరం: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలోని బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడుగురు అధికారుల బృందం మండలంలోని బాణసంచా తయారీ కేంద్రాల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఈ బృందంలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఫైర్ ఆఫీసర్ సత్యరాజు, సీఐ పిన్నింటి రమణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిణి, ఈవోపీఆర్డీ విష్ణుమూర్తి, లేబర్ ఆఫీసర్ పి.సూర్యనారాయణ, లీగల్ మెట్రాలజీ అధికారి ఆర్.ధనుంజయ్‌లు ఉన్నారు. వీరంతా శాఖల వారీగా బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనల మేరకు అణువణువూ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, రావలమ్మపాలెం, జీవీఎంసీ పరిధి గంగవరం గ్రామాల్లో పర్యటించి, బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలించినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు దీనిపై శనివారం పూర్తిస్థాయి నివేదికను అందించనున్నట్లు వెల్లడించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో వ్యాన్

- విజయవాడ వ్యాపారి దుర్మరణం



ప్రమాదంలో దుర్మరణం పొందిన వ్యాపారి కృష్ణకుమార్



లారీని ఢీకొట్టి నుజ్జయిన బొలెరో వ్యాన్ ముందు భాగం

యలమంచిలి రూరల్: యలమంచిలి సమీపంలో మర్రిబంద భారత్ పెట్రోలియం అవుట్‌లెట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వేగంగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయవాడకు చెందిన వ్యాపారి దుర్మరణం చెందాడు. యలమంచిలి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. విజయవాడ వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వ్యాపారి కృష్ణకుమార్(29) వ్యాపార కార్యకలాపాల్లో భాగంగా శుక్రవారం తునిలో పని పూర్తి చేసుకుని విశాఖపట్నం వెళ్లడానికి బొలెరో వాహనం ఎక్కాడు. అతను ప్రయాణిస్తున్న వ్యాన్ యలమంచిలికి సమీపంలో రోడ్డు పక్కన ఆపి ఉంచిన లారీని ఢీకొంది. దాంతో కృష్ణకుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రాజస్థాన్‌కు చెందిన అతడు విజయవాడకు వలస వచ్చి వన్‌టౌన్ ఏరియాలో సోదరుడితో కలిసి విద్యుత్ ఉపకరణాల దుకాణం నిర్వహిస్తున్నాడు. తమకు బాకీ పడిన వ్యాపారుల వద్ద నుంచి నగదు వసూళ్ల నిమిత్తం వస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యలమంచిలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికను నమ్మించి మోసగించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు



విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రేవతమ్మ

నాతవరం : పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకుని ఆపై ముఖం చాటేసిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. వివరాలివి. నాతవరం మండలం మాధవగనరం గ్రామానికి చెందిన గుడివాడ హరీష్ అదే గ్రామానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరంగా లోబరుచుకున్నాడు. పెళ్లి చేసుకోవాలని కోరడంతో నిరాకరించాడు. దాంతో బాధితురాలు నాతవరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శుక్రవారం నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ నాతవరం ఎస్ఐ సీహెచ్.భీమరాజుతో కలిసి వెళ్లి మాధవనగరం గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారని, బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదులో అంశాలు వాస్తవమని రుజువు కావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. గుడివాడ హరీష్ కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం మున్నారిపాలెం గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంటుగా పని చేస్తున్నాడని, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తామని తెలిపారు.

ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు







సమావేశంలో ప్రసంగిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా, పాల్గొన్న ఫార్మా యాజమాన్య ప్రతినిధులు

- ఔషధ పరిశ్రమల ప్రతినిధుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్ సూచన

పరవాడ: ఔషధపరిశ్రమల్లో భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. స్థానిక ఎకోనో హోటల్‌లో పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల నివారణ, భద్రతా చర్యలపై పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లోని పరిశ్రమలకు చెందిన చైర్మన్‌లు, మేనేజింగ్ డైరెక్టర్లు, డైరెక్టర్లు, ప్లాంట్ నిర్వహణ అధికారులు, భద్రతాధికారులు, హెచ్‌ఆర్ మేనేజర్లతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఫార్మా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణ కోసం కార్మికులకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతంగా పనిచేసే వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ పరిశ్రమలు జిల్లా అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడాలన్నారు. ప్రమాదాల సమయంలో సమయస్ఫూర్తితో స్పందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమని సూచించారు. భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అవసరమైన సూచనలను పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ సూచనలు చేశారు. సమావేశంలో ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్‌రెడ్డి, బాయిలర్ ఇన్‌స్పెక్టర్ కె.వీరభద్రరావు, పీసీబీ ఈఈ పి.వి.ముకుందరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్.వి.రమణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వి.అభిప్రియ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి కె.వసంతరావు, పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి సీఐలు ఆర్.మల్లికార్జునరావు, ఎస్.గణేష్, సీహెచ్ నరసింహరావు, ఎస్ఐలు కృష్ణారావు, రామారావు, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి జారిపడి యువకుడి మృతి



రాజేష్ మృతదేహం



రాజేష్ (ఫైల్)

కోటవురట్ల: ఇద్దరు బిడ్డలు బాగా చదువుకుని ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఇక పెళ్లిళ్లు చేసి కొడుకులు, కోడళ్లు పిల్లలతో సంతోషంగా గడిపేద్దామని ఆశపడ్డారు. ఇంతలో వారి ఆశలు ఆడియాసలు చేస్తూ చిన్నకొడుకు అశువులు బాసాడు. అన్నవరం గ్రామానికి చెందిన పైల పెదరాజు, అచ్చియమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. ఇద్దరినీ బాగా చదివించగా పెద్ద కొడుకు పైల సురేష్ బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్నకొడుకు పైల రాజేష్ మాకవరపాలెం మండలం జి.వెంకటాపురంలోని గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రాజేష్‌కు శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా సెలవు రావడంతో తాటికాయలు తినేందుకు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం 12 గంటల సమయంలో పొలానికి వెళ్లాడు.

తాటికాయలు కొట్టేందుకు చెట్టు ఎక్కిన రాజేష్(23) ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను వెంటనే స్నేహితులు, కుటుంబ సభ్యులు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్ది సేపటికే మృతి చెందాడు. దీనిపై కోటవురట్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. అందొచ్చిన కొడుకు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నలుగురితో సరదాగా ఉంటూ హుషారుగా ఉండే రాజేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

టీవీల అట్టపెట్టెల్లో గంజాయి స్మగ్లింగ్



గంజాయి నిందితులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ



స్మగ్లర్లు తరలిస్తున్న ఎల్ఈడీ గంజాయి అట్టపెట్టెలు

- తమిళనాడుకు చెందిన ఆరుగురి అరెస్ట్
- మరొకరు పరార్

నర్సీపట్నం : గంజాయి రవాణాకు స్మగ్లర్లు పలు మార్గాలను ఎంచుకుంటున్నారు. తాజాగా ఎల్ఈడీ టీవీలకు వినియోగించే అట్టపెట్టెల్లో గంజాయిని తరలిస్తూ తమిళనాడు రాష్ట్రం, కోయంబత్తూరుకు చెందిన ఆరుగురు స్మగ్లర్లు రూరల్ పోలీసులకు పట్టుబడ్డారు. మరొకరు పరారయ్యారు. నిందితులను డీఎస్పీ పి.శ్రీనివాసరావు ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా ఆయన వివరాలు వెల్లడించారు. రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, ఎస్ఐ రాజారావు, సిబ్బంది గబ్బాడ వద్ద శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. నిందితులు పోలీసులను చూసి కొంత దూరంలో బైక్ ఆపేసారు. అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న ఎల్ఈడీ అట్టపెట్టెలను పరిశీలించడంతో గంజాయి బయటపడిందన్నారు. మూడు బాక్స్‌ల్లో బాక్స్‌కు 20 కిలోల చొప్పున గంజాయి అమర్చారన్నారు. స్మగ్లర్ల నుంచి 60 కిలోల గంజాయి, ఆరు సెల్‌ఫోన్‌లు, బైక్ సీజ్ చేశామన్నారు. పట్టుబడ్డ వారిలో ఇద్దరు మహిళలు ఉన్నారన్నారు. నిందితుల్లో ఒకరైన కోయంబత్తూరు, కందసంగర్ వీధికి చెందిన కుమారి సింధూరం(34) ఇక్కడ నుంచి గంజాయి తీసుకువెళ్లి పాకెట్లో పెట్టి రూ.200 చొప్పున అక్కడ విక్రయిస్తుందని డీఎస్పీ తెలిపారు. ఈమెతో పాటు పట్టుబడ్డ సాధన కరప్ప స్వామి(20), దేవసాంబు (20), సూర్య కుమార్ సెల్వం(28), అల్లూరి జిల్లా, జి.మాడుగుల మండలం, వంజరి పంచాయతీ, పెదకింతల్లి గ్రామానికి చింతల సత్యనారాయణ(32)ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. పరారైన వ్యక్తి కోసం గాలిస్తున్నామన్నారు.

మిట్టల్ క్యాప్టివ్ పోర్టు అనుమతులు రద్దు చేయాలి

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం



మత్స్యకారులతో మాట్లాడుతున్న లోకనాథం

నక్కపల్లి: మండలంలో డీఎల్‌పురంలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం క్యాప్టివ్ పోర్టు నిర్మించేందుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కే లోకనాథం డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పోర్టు నిర్మించే డీఎల్‌పురం గ్రామాన్ని సందర్శించారు. సముద్రాన్ని గంగపుత్రులకు దూరం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. గంగపుత్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పోర్టు నిర్మాణానికి ఎలా అనుమతులు మంజూరు చేస్తారని ప్రశ్నించారు. వేలాది మంది మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటుందన్నారు. పేదల నుంచి కారుచౌకగా భూములు లాక్కొని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని మండిపడ్డారు. జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, కార్యవర్గ సభ్యుడు ఎం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్‌ఎఫ్‌ఐ నుంచి ఇద్దరు బహిష్కరణ

అనకాపల్లి టౌన్:ఎస్‌ఎఫ్‌ఐ విధానాలకు భిన్నంగా అనైతిక చర్యలకు పాల్పడిన యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, మాజీ కార్యదర్శి సుర్ల నాగరమణలను బహిష్కరిస్తూ జిల్లా కమిటీ నిర్ణయం తీసుకుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.జె.నాయుడు తెలిపారు. స్థానికంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల సమస్యలపై సమరశీలంగా పోరాడుతుందన్నారు. అందుకు భిన్నంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్, దివాకర్, కుమారి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


అమ్మవారి సన్నిధిలో చిన్నారుల నృత్య ప్రదర్శన

అనకాపల్లి టౌన్: అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఉత్సవాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మైదానంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీతానగరం ఆధ్యాత్మిక సేవ సమితి, కోలాట సంఘం, మూలపేట వెంకటేశ్వర హరి భజన, దిబ్బపాలెం డాక్టర్ ఎస్.తిలగవతి, నిర్మల మ్యూజిక్ డాన్స్ అకాడమీ, గాజువాక చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో వినకోట బుచ్చిరాజు, బొడ్డేడ మురళీ, చెక్కల శ్రీను, కర్రి గోవింద్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

హేమంత్‌కు గౌరవ డాక్టరేట్


హైదరాబాద్‌లో గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న చరపాక హేమంత్

కశింకోట: తాళ్లపాలెం శివారు బంగారయ్యపేట గ్రామానికి చెందిన చరపాక హేమంత్ యూఎస్ఏలోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ స్వీకరించారు. ఫార్మసీ రంగంలో హెల్త్ కేర్ సేవలు గుర్తించి దీన్ని అందజేశారు. నేషనల్ కన్జూమర్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా, ఫార్మసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హౌస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా అధ్యక్షునిగా హేమంత్ పదవులు నిర్వర్తిస్తున్నారు. తన సేవలకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ రావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 1,146 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
స్పెషల్ రకం	3,910	4,450
మొదటి రకం	3,750	4.400
రెండో రకం	3,460	4,090
మూడో రకం	3,000	3,360

అనకాపల్లి సినిమాలు

రాజా : మ్యాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2 : గుడ్ అండ్ బ్యాడ్ అగ్లీ
పర్తిసాయి : ఓదెలా-2
షిర్డీసాయి : అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర : కోర్టు
శ్రీసత్య : మధురం
రామచంద్ర : జాక్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 32 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 327 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 259 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని ఫోన్ నంబర్ 08924-223595లో సంప్రదించవచ్చు.

స్వచ్ఛత ఎక్కడ?


ఊడేరు గ్రామ ప్రధాన రహదారిపై నిలిచిన మురుగు, వర్షపు నీరు


కలెక్టరేట్ పరిసరాల్లో చెత్తను పోగుపెట్టి అక్కడే కాల్చేస్తున్న అధికారులు(ఫైల్)


పేరుకుపోయిన చెత్తా చెదారం

గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త,మురుగుతో దుర్గంధం

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'ప్రచార ఆర్భాటమేనా?

ప్రజాప్రతినిధులు, అధికారులు ఫొటోలకు ఫోజులతో సరి

తుమ్మపాల: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర, స్వచ్ఛత దివాస్ కార్యక్రమాలు ప్రజాప్రతినిధులు, అధికారుల ప్రచార ఆర్భాటాలకు ఉపయోగపడుతున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త, మురుగు పేరుకుపోవడమే నిదర్శనం. గతేడాది శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమాలు ప్రచారాలకే పరిమితమయ్యాయి. నెలలో ప్రతి మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పల్లెల్లో చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలు అధికారులు, ప్రజాప్రతినిధులు ఫొటోల ఫోజుల కోసం జరుగుతున్నట్టు కనిపిస్తోంది. స్వచ్ఛత విషయంలో మండలంలో ఏ ఒక్క గ్రామంలో కూడా చెప్పుకోదగ్గ మార్పు కనిపించడం లేదు. వేసవిలో సైతం రోడ్లపై మురుగు, వర్షపు నీరు నిలిచిపోయి దుర్గంధంగా వెదజల్లుతోంది. అనకాపల్లి పట్టణానికి ఆనుకుని పట్టణ రూపురేఖలు ఉన్న మేజర్ పంచాయతీలు కొత్తూరు, తుమ్మపాలతో పాటు గ్రామీణ ప్రాంతాలుగా ఉన్న కూండ్రం, కుంచంగి, వేటజంగాలపాలెం, సత్యనారాయణపురం, వెంకుపాలెం, సీతానగరం, ఊడేరు, దిబ్బపాలెం, బవులువాడ, మామిడిపాలెం, చేనుల అగ్రహారం, కోడూరు, తదితర గ్రామాల్లో రోడ్లు మురుగు, చెత్తా చెదారాలతో నిత్యం దర్శనమిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలు అధికారులు, పాలకులు ఫొటోలతో సరిపెడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆయా **గ్రామాల్లో వ్యర్థాలు రోడ్లపై** పేరు**కుపోయాయి.**

'సూపర్‌సిక్స్' నుంచి ఏమార్చేందుకు యత్నాలు

కూటమి ప్రభుత్వం ప్రధాన హామీలైన సూపర్‌సిక్స్ పథకాల అమలు నుంచి ప్రజల **దృష్టిని** మళ్లించేందుకు **గత 10** నెలల నుంచి **అనేక** ప్రయత్నాలు జరుగుతున్నాయి. భవిష్యత్ విజన్ పేరుతో ప్రణాళికలకే పరిమితమైన కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ హామీలిచ్చిన పథకాలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రచారానికి స్వచ్ఛత కార్యక్రమం బాగుండడంతో నెలలో ప్రతి మూడో శనివారం కొనసాగిస్తూ పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. అయితే అధికారులు, పాలకులు చీపుర్లు చేతపట్టి ఫొటోలకు ఫోజులిస్తూ ఎక్కడ చెత్త అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు.

అధ్వానంగా గ్రామాలు

పలు గ్రామాల్లో దళిత వాడలు మరింత **అధ్వానంగా** మారాయి. **చెత్తా చెదారంతో** పాటు రోడ్లకు **ఇరువైపులా** తుప్పలు పెరి**గిపోయాయి.** పల్లెల్లో ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద అపారిశుధ్యమే దర్శ**నమిస్తోంది.** కాలువలు **మురుగుతో** నిండిపో**యాయి.** పైపులైన్‌లు లీకై **నిత్యం** తాగునీరు వృథాగా **పోతోంది. సం**పద కేంద్రాలు అందుబాటులో ఉన్నా సిబ్బంది కొరత, చెత్త వాహనాలు లేక వీధి చివర్లలోనే చెత్త డంప్ చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో ఉన్న కలెక్టరేట్‌లో పేరుకుపోయిన చెత్తను పూర్తి స్థాయిలో తొలగించలేదు. కలెక్టరేట్ పరిసరాల్లో చెత్తను జిల్లా అధికారులు పోగుచేసి అక్కడే కాల్చేసి చేతులు దులుపుకొన్నారు. కలెక్టరేట్ ముఖ ద్వారం వద్దనే పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయి అధ్వానంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు


అక్కిరెడిపాలెంలో తుప్పల్లో ఉన్న మంచినీటి బోరు, పైప్‌లైన్ నుంచి లీకవుతున్న నీరు

మురుగు పోయే మార్గం లేదు..

తుమ్మపాల పంచాయతీ చినబాబుకాలనీలో మురుగునీరు పోయేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్లపైనే నిలిచిపోతోంది. వర్షపు నీరు కూడా అనకాపల్లి-చోడవరం రోడ్డుపైకి చేరుతోంది. భవనాల నిర్మాణంలో వాడుకనీరు పోయేందుకు సరైన ప్రణాళిక లేకపోవడంతో ఇప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పాలకుల చొరవ లేకపోడవంతో పంచాయతీ అధికారులు సరైన చర్యలు చేపట్టలేకపోతున్నారు.

– చదరం నాగేష్, చినబాబుకాలనీ, తుమ్మపాల పంచాయతీ.

49వ రోజుకు ఆర్టీసీ కార్మికుల దీక్షలు


ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

అనకాపల్లి టౌన్: ఉద్యోగ భద్రత సర్క్యులర్ 1/2019ను తక్షణమే అమలు చేయాలని ఎన్ఎంయుఏ కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 49వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్ చేసిన డ్రైవర్, కండెక్టర్లను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వి.ఆర్.ఎస్.ఎస్.రావు, కె.ఎస్.బాబు, నాయుడు, ఆర్.ఎస్.బాబు, బి.జె.రావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ


పూడిమడక జాతీయ రహదారి పెట్రోల్ బంక్‌లో అగ్ని ప్రమాదాలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక శాఖాధికారి నాగేశ్వరరావు

అనకాపల్లి: అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని అనకాపల్లి అగ్నిమాపక శాఖ అధికారి పి.నాగేశ్వరరావు అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక హెచ్‌పీ, ఇండేన్ గ్యాస్ గొడౌన్, పెట్రోల్ బంకుల్లో సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలకు గ్యాస్ సిలిండర్ అందించే సమయంలో డెలివరీ బాయ్ సిలండర్‌ను పరిశీలించి ఇవ్వాలన్నారు. గృహాల్లో గ్యాస్ ఎప్పుడైనా లీకైతే బయపడకుండా దగ్గరలో గ్యాస్ ఏజెన్సీకి తెలియజేయాలని ఆయన సూచించారు.

పంట కోతలను వాయిదా వేసుకోండి

అనకాపల్లి : వర్ష సూచన ఉన్నందున వరి కోతను వాయిదా వేసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుంద రావు శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. వర్ష సూచన ఉన్నందున, రాగి పైరు కోతను వాయిదా వేసుకోవాలని, ఒక వేళ ఇప్పటికే కోసి ఉంటే నీడగా ఉన్న స్థలంలో ఆరబెట్టుకోవాలన్నారు. నువ్వులలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వేరు, కాండం కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీ క్లోరైడ్ లేదా మాంకోజెబ్‌ను లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కలిపి మొక్కల మొదళ్లు తడిచేల పిచికారి చేయాలన్నారు. నువ్వులను నిలువ చేసేటప్పుడు పురుగు పట్టకుండా కిలో నువ్వులకు 5 గ్రా. వేపాకుపొడి లేదా 5 మీ.లి వేప నూనె కలుపుకోవాలన్నారు. వేరుశనగ పైరు కోతను వాయిదా వేసుకోవాలన్నారు. వర్షం వల్ల వచ్చే తేమను ఉపయోగించుకుని 45రోజుల కార్సి చేసిన చెరకు తోటల్లో ఎకరాలకు 150 కిలోల చొప్పున యురియాను మొక్కల మొదల్ల దగ్గర చిన్న గుంతలు తీసీ వేసుకోవాలని, చెరకులో ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు కొరడా తెగులు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ప్రొపికొనజోల్ 1 మి.లీ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు. 45, 90 రోజుల చెరకు వయసు గల మొక్క తోటల్లో, రాగల వర్షాన్ని ఉపయోగించుకుని ఎకరాకు 75 కిలోల యూరియాను మొక్కల మొదళ్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. వర్ష సూచన, గాలులు ఉండే అవకాశం ఉన్నందున పక్వానికి వచ్చిన అరటి గెలలను వీలైనంత త్వరగా కోసి మార్కెట్‌కు తరలించాలన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, టమాటా పంటలపై రైతులు ప్రత్యేక దృష్టిని సాధించాలన్నారు.

ఉపాధి వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి


ఉపాధి హామీ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలతో సీఐటీయు నాయకులు రొంగలి రాము

అచ్యుతాపురం రూరల్ : మండలంలో సుమారు కోటి రూపాయల వరకూ బకాయిపడ్డ ఉపాధి హామీ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. శుక్రవారం కొండకర్ల పంచాయతీలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ఏడు వారాలుగా బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. నెలల తరబడి ఉపాధి హామీ బకాయిలు చెల్లించకపోతే కూలీలు ఏవిధంగా జీవనం సాగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తట్టా, గునపం, పార, మంచినీళ్లు, ట్రావెలింగ్, సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని, అవి ఇప్పుడు పూర్తిగా కట్ చేసి రూ.7 పెంచినట్టు ప్రకటించడం అన్యాయమన్నారు. ఉపాధి హామీ శాఖకు మంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ కూలీల కష్టాలు అర్థం చేసుకోకపోవడం విచారకరమన్నారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అనకాపల్లి మొదటి స్థానంలో ఉందని కలెక్టర్ ప్రకటించారని, అయితే పనిచేసిన కూలీలకు వేతనాలు చెల్లించడంలో కూడా మొదటి స్థానంలో ఉండాలి కదా అని ప్రశ్నించారు.

వర్షంతో ఇక్కట్లు


భవాని కాలనీలో నిలిచిన వర్షపు నీరు

కశింకోట: కశింకోట ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. లోతట్టు వీధుల్లో నీరు నిలిచిపోయింది దీంతో రాకపోకలు సాగించడానికి జనం ఇబ్బంది పడ్డారు. ఆకాశం మేఘావృతమై అకస్మాత్తుగా వర్షం కురిసింది. దీంతో స్థానిక భవానీ కాలనీ, ఆర్టీసీ బస్ స్టేషన్, గాడి వీధి తదితర పల్లపు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో నీటిలో నుంచి రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడ్డారు. భవాని కాలనీలో రోడ్డు పల్లంగా ఉండడంతో కాలువలోకి నీరు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. చిన్నపాటి వర్షం పడినా ఇక్కట్లు తప్పడం లేదని స్థానికులతో పాటు రైల్వే స్టేషన్, సత్తెమ్మ కాలనీ, జాతీయ రహదారికి రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులు వాపోతున్నారు. రోడ్డుపై నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్


కశింకోట వద్ద జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు


రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

కశింకోట: కశింకోట వద్ద శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కశింకోట కూడలి నుంచి దాదాపు బయ్యవరం వరకు వాహనాలు బారులు తీరాయి. స్థానిక కూడలిలో రోడ్డు దాటడానికి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇక్కడ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


శిలువ మోస్తున్న ఏసుక్రీస్తు వేషధారి


కశింకోటలోని ఆంధ్ర కల్వరీ సెంచునరీ బాప్టిస్టు చర్చిలో ఏసుక్రీస్తును కీర్తిస్తూ యువతి ప్రసంగం

అనకాపల్లి టౌన్: గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు మరణానికి సంబంధించిన ఘట్టాలను ప్రదర్శిస్తూ పట్టణంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల జంక్షన్, రామచంద్ర థియేటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఈ ర్యాలీ సాగింది. కేథలిక్ చర్చి ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏసుక్రీస్తు వేషధారి శిలువను మోయడం, ఆయనను రాజబటులు కొడుతూ చిత్రహింసలకు గురిచేయడం భక్తులను కలిచివేసింది. ఈ ప్రదర్శనలో పట్టణంలోని వివిధ చర్చి ఫాదర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంధ్ర కల్వరీ సెంచునరీ బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షలు చేపట్టారు. చర్చి పాస్టర్ సన్నీ జేమ్స్ ఏసుక్రీస్తు ప్రవచించిన బోధనలు వినిపించారు. చర్చి కమిటీ ప్రతినిధులు మోజెస్, నాగేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, బాలికల హైస్కూలు హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణ కుమారి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో కూడా గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. పాస్టర్ జేమ్స్ ఈ సందర్భంగా ఏసుక్రీస్తు శిలువ వేసినప్పుడు పలికిన ఏడు మాటల గురించి విపులంగా వివరించారు. పిల్లలు ఏసుక్రీస్తును స్తుతిస్తూ బృంద గీతాలాపన నిర్వహించారు. స్థానిక ఇందిరా కాలనీ, షాలెం మందిర్, బయ్యవరం, తాళ్లపాలెం, నూతలగుంటపాలెం, నరసింగబిల్లి, అచ్చెర్ల, ఉగ్గినపాలెం, తేగాడ, కొత్తపల్లి తదితర గ్రామాల్లోని చర్చిల్లో కూడా గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు చేశారు.


గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థనా మందిరంలో ఏసుక్రీస్తును కీర్తిస్తూ యువతుల గీతాలాపన


ఏసుక్రీస్తు ప్రవచనాలు వినిపిస్తున్న పాస్టర్ జేమ్స్


ఆంధ్ర కల్వరీ సెంచునరీ బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


పట్టణంలో క్రైస్తవ సోదరుల భారీ ర్యాలీ

రేపు ఇస్కాన్ పాదయాత్ర

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఇస్కాన్ పాదయాత్ర నిర్వహించనున్నట్లు హరేకృష్ణ సత్సంగ ఆశ్రమం నిర్వాహకులు తెలిపారు. ఈ పాదయాత్ర గవరపాలెం గౌరీసేవా సంఘం నుంచి మెయిన్ రోడ్ మీదుగా ఎన్టీఆర్ మైదానానికి చేరుకొని నూకాంబిక అమ్మవారి ప్రాంగణంలో సంధ్యా హారతి కార్యక్రమం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్


రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కశింకోట: మండలంలోని ఏఎస్ పేట వద్ద ఉన్న రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలపై శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో యలమంచిలి అగ్నిమాపక దళ అధికారి డి.రాంబాబు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది, పరిశ్రమ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక : ఒడిశా నుంచి అక్రమంగా బీర్ బాటిళ్లను తీసుకువెళుతున్న వ్యక్తిని అరెస్టు చేసి కారును సీజ్ చేసినట్టు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గురువారం రాత్రి ఎస్‌ఐ ప్రసాదరావు నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. కాకినాడకు చెందిన వ్యక్తి ఒడిశా రాష్ట్రం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా 105 టిన్ బీర్లను రవాణా చేస్తుండడంతో గుర్తించి అతనిని అరెస్టు చేశారు. బీర్ బాటిళ్లను తరలిస్తున్న కారును సీజ్ చేసినట్టు తెలిపారు.